
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 23 నవంబర్ 2024




ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

వలంటీర్లను కొనసాగించాలని ధర్నా

నేతల అరెస్టు, విడుదల
సిఐటియు ఖండన
ఎన్నికల హామీ నెరవేర్చాలి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తొలగించిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపు మేరకు తిరుపతి కలెక్టరేట్ ఎదుట వాలంటీర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గ్రామీణ, వార్డుల్లో పనిచేసిన వాలంటీర్లకు ఉపాధి చూపాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన పదివేల రూపాయల వేతన హామీని నెరవేర్చాలని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం బలవంతంగా రాజీనామా చేయించిన వాలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకుని, వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్‌చేశారు. లేనిచో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాను పోలీసులు భగ్నం చేస్తూ ముఖ్య నాయకులను అరెస్టు చేశారు. నాయకులు పి.మునిరాజా, వాలంటీర్ల నాయకులు సుప్రజ, మురళి, నవీన్, రమణి, కావ్య, ఇస్మాయిల్‌లను అరెస్టు చేసి తిరుచానూరు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి తరువాత విడుదల చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్పందిస్తూ గత ప్రభుత్వం లానే ఈ ప్రభుత్వమూ ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూడటం భావ్యం కాదని, వాలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులను ఖండించారు.

'శ్రీసిటీ'లో 'జాగృతి యాత్ర' బృందం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

జాగృతి యాత్రా బృందానికి చెందిన 530 మంది సభ్యులు శ్రీసిటీని సందర్శించారు. ఔత్సాహక పారిశ్రామికవేత్తలను తయారుచేసే లక్ష్యంతో ముంబాయికి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా పర్యటించి, వివిధ రంగాలలో ఆదర్శవంతులను (రోల్ మోడల్‌లు) కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికులలో స్ఫూర్తి నింపుతుంది. శ్రీసిటీని సందర్శించిన బృందంలో అమెరికా, యూరోప్ కు చెందిన 13 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారు..పర్యటనలో భాగంగా తాము రోల్ మోడల్ గా ఎంచుకున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో పరస్పర చర్చా కార్యక్రమంలో జాగృతి సభ్యులు పాల్గొన్నారు. 2008లో ప్రారంభమైన ఈ జాగృతి యాత్ర ఇప్పటివరకు 8వేల మంది యువ భారతీయులను ప్రభావితం చేసింది



ముక్కంటి క్షేత్రంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దక్షిణ కైలాసంగా ప్రసిద్ధిగాంచిన ముక్కంటి క్షేత్రంలో రోడ్ల ఆక్రమణల ప్రక్షాళనకు అధికారులు శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖ సంయుక్తంగా ఈ చర్యలకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఉపక్రమించింది. సన్నిధి వీధి నుంచి భరద్వాజ తీర్థం వరకు రోడ్డుకిరువైపులా కొన్ని దుకాణాలు ముందుకు వచ్చాయి. దీంతో నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఈ మార్గంలో దుకాణాలు, పోస్టర్లు, బోర్డులు రోడ్డులోకి చొచ్చుకు రావడం వల్ల ట్రాఫిక్ సమస్య నిరంతరాయంగా ఉంటోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన రోడ్ల ఆక్రమణలు తొలగించేందుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో ఎన్నో ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారుల నుంచి కాస్తంత వ్యతిరేకత వ్యక్తమైనా ట్రాఫిక్ సమస్య దష్ట్యా అధికారులు ముందుకే వెళ్లడం జరుగుతోంది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆక్రమణల తొలగింపుపై సానుకూలంగానే ఉండడంతో అధికారుల పని సులువవుతోంది.


గురుకుల పాఠశాల సమస్యలపై చర్చిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

సిపిఎం జిల్లా మహాసభలు

1, 2 తేదీల్లో సత్యవేడులో

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

డిసెంబర్ 1, 2 తేదీల్లో సత్యవేడులో జరగనున్న సిపిఎం 14వ జిల్లా మహాసభల పోస్టర్‌ను శుక్రవారం యశోదనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, జీతం పదివేలకు పెంచుతామని ఇచ్చిన హామీని విస్మరించి, వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని తప్పుబట్టారు. సత్యవేడులో జరగనున్న సిపిఎం మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రజా సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భాస్కర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎ.పుల్లయ్య పాల్గొన్నారు.


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - సత్యవేడు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల, జ్యోతిరావుపూలె గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి డిమాండ్ చేశారు. శుక్రవారం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌ను కోరారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల హెల్త్ ఆఫీసర్ నిర్లక్ష్యం వీడాలన్నారు. జ్యోతిరావు పూలె గురుకుల పాఠశాలలో టీచర్ల మధ్య సమన్వయ లోపం వల్ల విద్యార్థుల భవిష్యత్ చెడుదారి పడుతోందన్నారు. కేర్‌టేక్ ఆఫీసర్, ఇన్‌ఛార్జిలు సరిగ్గా డ్యూటీ చేయకపోవడం వల్లనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని మండిపడ్డారు. తక్షణమే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు లోకేష్, హర్షద్, మురళి పాల్గొన్నారు.

జార్జియాలో 'తెలుగు విద్యార్థులను కాపాడండి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జార్జియా దేశంలో ఎంబిబిఎస్ కోర్సు చేయడానికి వెళ్లిన 60 మంది తెలుగు విద్యార్థులు అక్కడి హాస్టల్ నిర్వాహకులు చేసిన మోసంతో రోడ్డున పడ్డారని, భారత ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కలుగజేసుకొని క్షేమంగా ఆ విద్యార్థులను స్వదేశానికి తీసుకురావాలని విద్యార్థిని తండ్రి వై.ఆనంద్ రెడ్డి ప్రభుత్వాల పెద్దలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జార్జియా దేశంలో ఉన్న ఇలియా యూనివర్సిటీలో 60 మంది తెలుగు విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి చేరి స్థానికంగా ఉన్న హ్యాపీ లివింగ్ ప్రైవేట్ హాస్టల్ లో వసతి కోసం హాస్టల్ భవన లీజు దారుడైన కమ్రాన్‌కు 8 నెలల ఫీజుకు సంబంధించి రూ.1,20,000 రూపాయలను చెల్లించారన్నారు. లీజుదారుడు కమ్రాన్ మోసం చేసి వెళ్లిపోవడంతో, ఆ భవన యజమాని విద్యార్థులను 4 సెంటీగ్రేడ్ వాతావరణంలో రాత్రిపూట హాస్టల్ నుండి బయటకు పంపేశారన్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో విద్యార్థులు అక్కడి భారత రాయబార కార్యాలయానికి ఈ మెయిల్ ద్వారా సమస్యను తెలియపరచారన్నారు. తన కుమార్తె వై.జ్యోతిక, ఇతర విద్యార్థులు స్వదేశానికి రావడానికి ఇక్కట్లు పడుతున్నారని, విద్యార్థులను కాపాడాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇరుగులంలో తప్పిపోయిన తల్లీబిడ్డ

ప్రజాశక్తి - సత్యవేడు



తిరుపతి జిల్లా సత్యవేడు మండలం ఇరుగుళం గ్రామంలో నివసిస్తున్న మునిశేఖర్ సతీమణి హేమావతి, కూతురు చిన్నారి నయనిక తప్పిపోయారు. గురువారం ఉదయం ఉద్యోగ నిమిత్తం ఇంటర్వ్యూ కోసం వెళ్తున్నట్టు హేమావతి తన కూతురు చిన్నారి నయనికను తీసుకొని ఇంటి నుంచి బయలుదేరి వెళ్ళింది. ఈ నేపథ్యంలో పొద్దుపోయినా ఇంటికి రాలేదు. ఈ క్రమంలో హేమావతి భర్త మునిశేఖర్ భార్యాకూతురు ఆచూకీ కోసం బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసినా ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో శ్రీసిటీ పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేయడంతో శ్రీసిటీ ఎస్ఐ హరి ప్రసాద్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. వీరి ఆచూకీ తెలిసిన వాళ్ల శ్రీసిటీ ఎస్ఐ 9346179833 మొబైల్ నెంబర్ కు తెలియజేయవలసిందిగా కోరారు.

త్రో బాల్ రాష్ట్ర పోటీలకు పెద్దకనపర్తి విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



అండర్-14 బాల, బాలికల రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. రామచంద్రాపురం మండలం నెత్త కుప్పంలో ఈ నెల 21న జరిగిన జిల్లా స్థాయి త్రో బాల్ పోటీల్లో ఎన్.రాణి(8వ తరగతి), కే.గురు లోకేష్(8వ తరగతి)లు ఉత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబర్లో చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి త్రో బాల్ టోర్నమెంట్ లో పాల్గొననున్నారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను పెద్దకనపర్తి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బందం శుక్రవారం అభినందనలు తెలియజేసింది. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం. చెంగల్రాయులు, ఉపాధ్యాయులు బాలాజీ, ఫౌజియా, గోపాల్, మోతీలాల్, సరిత, జరీనా, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో రైతులకు సేవలందించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



సేవాభావంతో రైతులకు సేవలందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం రైతు సేవా కేంద్ర సిబ్బందికి కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమం జరిగింది. సాంకేతిక అంశాలను వృత్తి సామర్థ్యంతో రైతులకు వివరించి వారి వృద్ధికి సాయపడాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్‌పై జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా అధికారి మురళీకృష్ణ, ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య, ఎడిఎ లక్ష్మీదేవి, ఎఒలు వేణుగోపాలురావు, శ్రీనివాస్, శశికళ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.4 లక్షల జరిమానా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 40 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతిలో హాజరు పరిచారు. జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10వేల చొప్పున మొత్తం 40 మందికి 4 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ ఎల్ . సుబ్బరాయుడు అభినందించినారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ బాధ్యత తో విధులు నిర్వర్తించాలని సూచించారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

నగరంలోని 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు, ట్రీ కటింగ్ కారణం చేత పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ తిరుపతి ఆపరేషన్ చంద్రశేఖర రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎస్పీడిసిఎల్ తిరుపతి పరిధిలోని గాంధీ రోడ్డు, జి. ఎన్. మాడ విధి, జి. కార్ స్ట్రీట్, చిన్న బజారు విధి, ప్రకాశం రోడ్డు, వి.ఎమ్.సి. ఆర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రోడ్డు, హరిద్వార్ కాలనీ, పోస్టల్ కాలనీ, గరుడాద్రి నగర్, కష్ణ తేజ, తెలుగు నగర్, సి. పి. ఆర్ అపార్ట్మెంట్, కళాంజలి షోరూమ్, మధురానగర్, తుడా ఆఫీసు రోడ్డు, వివేకానంద నగర్, ప్రకాశం పార్క్ పరిసర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రోడ్డు స్థలం ఆక్రమణ : పవన్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి రూరల్ పరిధి శ్రీనివాసపురం గ్రామపంచాయతీలో ఓ అపార్ట్మెంట్ నిర్మాణదారుడు దౌర్జన్యంగా రోడ్డు స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్థానికులకు సౌకర్యవంతంగా ప్లాన్ ప్రకారం రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని నివాసితుడు పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో పవన్ కుమార్ మాట్లాడారు. శ్రీనివాసపురం గ్రామపంచాయతీ లెక్క దాఖలా సర్వేనెంబర్ 330/1 లో శంకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తులు పంచాయతీలో జిప్లస్ 'త్రీ' అనుమతులు పొంది నిబంధనలకు వ్యతిరేకంగా 5 అంతస్తుల అపార్ట్మెంట్ భవనాన్ని నిర్మిస్తున్నారన్నారు. అపార్ట్మెంట్ నిర్మాణం రోడ్డు ఆక్రమించి కట్టొద్దని, పంచాయతీలో ఫిర్యాదు చేస్తే వారికి నోటీసు అంటించడానికి వెళ్లిన స్థానిక పంచాయతీ సిబ్బందిపై దురుసుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తూ నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హులైన ప్రత్యేక ప్రతిభావంతులకు పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అర్హులైన దివ్యాంగులు (ప్రత్యేక ప్రతిభావంతులు) అందరికీ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే సామాజిక పింఛన్లను ఇవ్వాలని శ్రీ కనకదుర్గ దివ్యాంగ్ సొసైటీ అధ్యక్షులు సురేష్ బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు కల్పించే సౌకర్యాలు అమలులో ఆయా ఫలితాలను పొందలేని దివ్యాంగులకు తమ సొసైటీ ద్వారా తగిన సహకారాలను అందించి ఆయా పథకాలను అందిపుచ్చుకునేలాగా కషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం బ్యాక్ లాగ్ అమలులో జాప్యం లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇతర రాష్ట్రాల్లో లాగా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. దివ్యాంగులలో సొంత ఇల్లు లేని వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఆ జాబితాను జిల్లా కలెక్టర్ కు అందజేసి సొంత ఇంటిని కేటాయింపు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కోదండ, రెడ్డి విశ్వనాధ్, శరత్ బాబు, దేవరాజులు పాల్గొన్నారు.

తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల


ఈవో జె.శ్యామలరావు డంపింగ్‌యార్డు పరిశీలన

తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం విస్తృతతనిఖీలు నిర్వహించారు. ముందుగా గోగర్భం జలాశయం సమీపంలోని కాకులమాను దిబ్బ వద్ద ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. అక్కడ దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో 30 సంవత్సరాల నుంచి పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించేందుకు అని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పేరుకుపోయిన చెత్త వల్ల దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టామని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమల డంపింగ్ యార్డులోని చెత్తను తరలించేందుకు తిరుపతి మున్సిపాలిటీ అధికారులతో చర్చించామని, మున్సిపాలిటీ అధికారులు ఇప్పటికే డంపింగ్ యార్డును సందర్శించినట్లు తెలిపారు. మూడు, నాలుగు నెలల్లో చెత్తను మొత్తం తొలగిస్తామన్నారు. భవిష్యత్తులో వచ్చే చెత్తను శాస్త్రీయంగా డంపు చేసే విధానం అమలు చేస్తామన్నారు. తడి చెత్త కూడా వేల టన్నులు ఉందని, ఐఓసీఎల్ బయో గ్యాస్ ప్లాంటు అందుబాటులోకి వస్తే తడి చెత్త తగ్గుతుందన్నారు. ఇప్పటికే తడి చెత్త ద్వారా 20వేల టన్నుల కంపోస్టు తయారు చేశామన్నారు. అనంతరం పాపవినాశనం చేరుకున్న ఈవో మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకొను గదులు, పార్కును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫారెస్టు అధికారులతో మాట్లాడి పార్కును అభివద్ధి చేయాలని ఆదేశించారు. పాపవినాశనంలోని సూచీ బోర్డులను రీ పెయింటింగ్ చేయాలని సూచించారు. పాపవినాశనం టోల్ గేట్ వద్ద జారీ చేసే టోల్ రశీదులను తనిఖీ చేశారు. అనంతరం ఆకాశగంగ తీర్థాన్ని పరిశీలించి భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆకాశగంగ మెట్ల మార్గంలో భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా దుకాణాల ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో టీటీడీ సిఈ సత్యనారాయణ, ఈ ఈ సుధాకర్ ,ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ సిఎఫ్ శ్రీనివాస్ ,డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.


మనవడి సినిమా చూసేందుకు వచ్చిన గల్లా దంపతులు

'దేవకి నందన వాసుదేవ' సినిమాను ఆదరించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తన మనవడు గల్లా అశోక్ నటించిన రెండో సినిమా 'దేవకీ నందన వాసుదేవ' సినిమా పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికి నచ్చుతుందని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తెలిపారు. శుక్రవారం తిరుపతి గ్రూప్ థియేటర్‌లో సినిమా విడుదల సందర్భంగా అభిమానులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు. గల్లా అరుణకుమారి కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని వీక్షించారు. తన మనవడు హీరోగా నటించిన చిత్రాన్ని ఆదరించాలని కోరారు. సనాతన ధర్మాన్ని తెలియజేసేలా సినిమా ఉందన్నారు. గల్లా రామచంద్రనాయుడు, మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, సంధ్య థియేటర్ ప్రొప్రైటర్ గిరిజ, ఊక విజయ్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, మునినాదం, బాబ్జీ సినిమాను వీక్షించారు.

తిరుపతిలోనే టిటిడి ఉద్యోగులకు ఇళ్లస్థలాలివ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టిటిడిలోని ఎనిమిది వేల మంది శాశ్వత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వారికి అలిపిరి - పేరూరు మార్గంలో ఉన్న 400 ఎకరాల్లో ఇళ్ళస్థలాలు కేటాయించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్‌చేశారు. తిరుపతిలో ఉన్న స్థలాలను వదిలేసి ఎక్కడో అడవుల్లో ఇవ్వడం భావ్యం కాదన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పరిపాలనా భవనం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. టిటిడి ఉద్యోగులకు ఒక్కొక్కరికి ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలని, దివ్యారామం పార్కును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు గోపి గౌడ్, రవి తేజోవతి, ముని శోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



డ్రోన్ టెక్నాలజీలో ఫ్లైట్ పెట్రోలింగ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

దేశ వ్యాప్తంగా ప్రజా భద్రత, ట్రాఫిక్ నిర్వహణలో విప్లవాత్మక మార్పులు కోసం ఐడియాఫోర్జ్ చే ఫ్లైట్ పెట్రోల్ డ్రోన్ అందుబాటులోకి తేనున్నట్లు డెహ్రాడూన్ ఎస్ ఎస్ పి అజయ్ సింగ్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీలో అంతర్జాతీయంగా అగ్రగామిగా వెలుగొందుతున్న ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్ దాని విప్లవాత్మక ఫ్లైట్ పెట్రోల్ డ్రోన్‌ను ఒక సేవా పరిష్కారంగా ప్రజా భద్రత, చట్ట అమలులో విప్లవాత్మక మార్పులు చేస్తోందన్నారు. ఉత్తరాఖండ్, రాజస్థాన్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో విజయవంతంగా అమలు చేయబడిన ఫ్లైట్ పెట్రోల్ ఇప్పటికే, పట్టణ భద్రతను మెరుగుపరచడంలో దాని ప్రభావాన్ని నిరూపించిందన్నారు. విశాఖపట్నం, విజయవాడ వంటి వేగంగా అభివద్ధి చెందుతున్న నగరాలకు నిలయంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా, అధిక వాహనాల సాంద్రత, పెరుగుతున్న రహదారి రద్దీ కారణంగా ట్రాఫిక్ రద్దీని నిర్వహించడంలో, ప్రజల భద్రతను నిర్ధారించడంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఇలాంటి తరుణంలో ఐడియా ఫోర్జ్ యొక్క ఫ్లైట్ పెట్రోల్ సొల్యూషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు తిరుపతిలో ఔషధ నిపుణుల భారీర్యాలీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శనివారం తిరుపతి నగరంలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా ఔషధ నిపుణుల భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ద ఇండియన్ ఫార్మాసుటికల్ అసోసియేషన్ తిరుపతి నగర బ్రాంచ్ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ రంగనాయకులు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఔషధ వినియోగం పైన సరైన అవగాహన కల్పించడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ర్యాలీ ప్రారంభ కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎస్వీయు ఉప కులపతి అప్పారావు, డ్రగ్ ఇన్స్పెక్టర్ సుభాషిని పాల్గొంటారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రమేష్ రెడ్డి, శర్మ, ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామగ్రామానికీ సిసి రోడ్లు

-రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామగ్రామానికీ సిసి రోడ్లు ఏర్పాటు చేయ నున్నట్లు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం గ్రామ పంచాయతీ కైలాస పురం, కనుమిట్ట గ్రామంలో రూ.2.80 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శుక్రవారం భూమి పూజచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం జయశేఖర్, టిడిపి నాయకులు మోహన్ రాజు, సుధాకర్ నాయుడు, కృష్ణకుమార్, చలపతిస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలంలో ఉపాధి హామీ నిధులు పది లక్షలతో సిసి రోడ్ల పనులు చేపట్టారు. రామసముద్రం నుండి కప్పాల వారి ఇళ్లకు రూ. 10 లక్షలతో, నారాయణపురం హరిజనవాడ, యానాది కాలనీలో 3 పనులకు రూ.8 లక్షల 40 వేలు అంచనాతో పనులను ప్రారంభించారు. ఈ పనులు ఎంపిడివో పి. శేషగిరి రావు , డిఇ పిఆర్ కె వెంకటరమణ, ఏఈ టిఆర్ఎస్ నాగేంద్రన్ పరిశీలించారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



క్రీడాకారులకు షూస్, జ్ఞాపికలు అందించిన జెవివి నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని జెవివి నాయకులు సూచించారు. జిల్లా స్థాయి హాకీలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు, షటిల్ క్రీడలో జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడా కారులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం షూస్, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెవివికి అన్ని విధాలా సహకరిస్తున్న ఆత్మీయ ఉపాధ్యాయురాలు కల్పనకు జెవివి తరుపున జ్ఞాపికను సీనియర్ సభ్యులు పురుషోత్తం, చెంచు నారాయణ ద్వారా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గతంలోనూ క్రీడా కారులకు అన్ని సౌకర్యాలు కల్పించి ప్రోత్స హించామన్నారు. జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో క్రీడాకారులకి అవసరమైన షూస్‌కు జ్ఞాపిక అందించడం చాలా సంతోషంగా వుందని తెలిపారు. క్రీడాకారులు వారి వారి క్రీడల్లో ఉన్నతంగా రాణించి మంచి స్థాయికిచేరుకుని వారి స్కూలుకు మంచి పేరు తేవాలని, చదువుతో పాటూ ఉన్నత స్థాయికి చేరు కోవాలని కోరుతున్నామన్నారు. ప్రత్యేకంగా స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ , చెంచు నారాయణ, నాగరాజు, పురుషోత్తమ రావు, పీడీ శివకుమార్, టీచర్ కల్పన పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణంలోని ఇందిరా నగర్, చవట గిరిజన కాలనీలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర డ్రైవింగ్ స్కూల్ వాసు సహకారంతో పేద గిరిజనులకు సీనియర్ రొటేరియన్స్ ఎల్లిసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంఠి రామ్మోహనరావు చేతుల మీదుగా శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ పేద ప్రజలకు రోటరీ వెస్ట్ క్లబ్ ఎల్ల వేళలా అండగా ఉంటుందని, 150 మంది పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు, కార్యదర్శి చోళవరం గిరిబాబు, దువ్వూరు రవీంద్రారెడ్డి, డివి బాలసుబ్రహ్మణ్యం, ధనుంజయ రెడ్డి, సనత్ రెడ్డి, బలరామిరెడ్డి, పర్చూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు: ఎఎస్ఐ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ కె భాస్కర్ హెచ్చరించారు. గేట్ పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ర్యాగింగ్, మత్తు పదార్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేము అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎఎస్ఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, విద్యార్థులు సెల్ ఫోన్ ఎక్కువగా వినియోగించడం వల్ల చెడు అలవాటుకు బానిస అవుతారని హెచ్చరించారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏపీ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలు, కల్తీ పురుగుల మందు లు, రైతులను మోసం చేసే ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు విక్రయించిన ప్రతి వస్తువుకు బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వరి పంట విత్తనాల పురుగుమందు గోడౌన్లను అగ్రికల్చర్ సహాయ సంచాలకులు జే సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రబీ సీజన్ కారణంగా విత్తనాల కొనుగోలు చేసే సమయంలో చుట్టూ తిరుగుతున్నారన్నారు. బుచ్చినాయుడు కండ్రిగలో ఐదు దుకాణాల వద్ద వరి విత్తనాలు విక్రయిస్తుండడంతో అధికారులు ఆ దుకాణాలను పరిశీలించారు. నాసిరకం విత్తనాలు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, షాపుల సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిర్ణీత ధరలకే విక్రయించాలని సూచించారు. వీటిని విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమానులు మూర్తి, సుబ్బారావు పాల్గొన్నారు.

రామచంద్రపురం(చంద్రగిరి): మండలంలోని ఎరువుల పురుగు మందులు, విత్తనాల విక్రయ కేంద్రాన్ని (ఫర్టిలైజర్ దుకాణాన్ని) వ్యవసాయ అధికారి భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం రసాయన ఎరువులు, పురుగు మందులు, విత్తన విక్రయ కేంద్రంలో సేల్స్ అండ్ స్టాక్ రిజిస్టర్ లను , ఆయన పరిశీలించారు. రబీ సీజన్ లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని షాప్ యజమానిని ఆదేశించారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందజేయాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకురావాలని కోరారు.

బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించండి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఆనందగౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : బీసీ కార్పొరేషన్లను బలోపేతం చేసి నిధులు కేటాయించాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగాల ఆనంద గౌడ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు ఛాంబర్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తో కలిసి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగాల ఆనంద గౌడ్ ముఖ్యమంత్రికి కలిసి వినతిపత్రం అందించారు. గత ఐదు సంవత్సరాలుగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా పూర్తిగా నిర్వీర్యం చేసి బీసీ సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేషన్లు, కుల కార్పొరేషన్ లకు నిధులు కేటాయించి బలోపేతం చేశారని తెలిపారు. బడ్జెట్లో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయడం పట్ల, బడ్జెట్లో బీసీలకు అధిక నిధులు కేటాయించడం పట్ల బీసీ సంక్షేమానికి పెద్ద పీట వేయడమే ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భక్తులకు అన్నదానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షులు బత్తెన మధుబాబు పెళ్లిరోజు సందర్భంగా శుక్రవారం స్థానిక గాలిగోపురం వద్ద అన్నదానం చేశారు. ముందు మధు దంపతులకు జనసేన యువ నాయకుడు పసుపులేటి నవీన్ కుమార్ ఘనంగా స్వాగతం పలికి ముక్కంటి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

108కు విశ్రాంతి

నెలరోజులుగా తిరుపతిలోనే వాహనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణ, గ్రామీణ పరిసర ప్రాంతాల్లో అత్యవసర రోగులకు, గర్భిణులకు అత్యవసర వైద్య సేవలు అందించే 108 వాహనానికి నెల రోజులుగా మరమ్మతులకు గురై రోగులకు వైద్య సేవలు అందించడంలో చేతులెత్తేసింది. అయినా సంబంధిత అధికారులు 108కు మరమ్మతు చేయడం మరిచిపోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా వుంటే 108 సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో 108 సిబ్బంది సమ్మెకు సిద్ధమవుతున్నామని తెలిపారు. అందువల్ల పుత్తూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం అవసరమైతే నారాయణవనం, వడమాలపేట, కార్వేటి నగరం, శ్రీకాళహస్తి నుంచి రావాల్సిందే.

అత్యవసర పరిస్థితిలో వుండే రోగులు, రోడ్డు ప్రమాదాలకు గురైనవారు, గర్భిణుల పరిస్థితి అయోమయంగా మారి ప్రాణాలకు సంకటంగా మారింది. ప్రతి రోజూ సగటున 108 ద్వారా కనీసం ఐదు కేసులు కంటే ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ విషయాన్ని 108 గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి మండలానికి ఒక 108 ఉంటుంది. అత్యవసర పరిస్థితిలో ఇతర మండలాల నుంచి 108 రావాల్సిన పరిస్థితి నెలకొంది. అందువల్ల జిల్లా వైద్య శాఖాధికారులు చర్యలు తీసుకుని 108కు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాల్సిన అవసరం వుంది.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు: ఐసిడిఎస్



బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బాల్య వివాహాలపై కఠిన చర్యలు తప్పవని పుత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపరువైజరు రోజా రమణి హెచ్చరించారు. వడమాల పేట మండలం ఎస్‌బిఆర్ పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలు, మహిళల దినోత్సవంలో భాగంగా శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే రక్తహీనత తగ్గుతుందని, బాల్యంలోనే పిల్లలు పుడితే కుటుంబ భారం పెరుగుతుందని, అందుకోసమే ప్రభుత్వం బాల్య వివాహాల నిరోధ చట్టం వుందన్నారు. పౌష్టికాహారం, సేఫ్టీ చైల్డ్ హెల్ప్ లైన్-1098, ఉమెన్ హెల్ప్ లైన్-181 వీటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, జయచంద్ర, సుజాత, మహిళా పోలీస్ మహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని గూడూరు ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో విజేతలకు శుక్రవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో తమ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. ఫుట్ బాల్‌లో జవహర్ భారతి కావలి జట్టు ప్రథమ స్థానం , కృష్ణ చైతన్య డిగ్రీ కాలేజ్ ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఖోఖోలో జెబి కళాశాల ప్రథమ, విఎస్‌యు పిజి సెంటర్ ద్వితీయ స్థానం సాధించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై శ్రీనివాసులు , పినారాయణ రాజు , వెంకటేశ్వర్లు , రవీంద్ర బాబు , ప్రసాద్ రెడ్డి , ప్రవీణ్ కుమార్ , మణికంఠ , శ్రీనివాసులు ,తిరుపాల్, బ్రహ్మయ్య పాల్గొన్నారు

సమస్యను పరిష్కరించే వరకూ అడ్డుకుంటాం

- రెండు రోజులుగా వినూత్న నిరసన
- టిడిపి నాయకుడి హామీతో విరమణ



రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -పెళ్లకూరు: ధ్వంసమైన రోడ్డు సమస్యను పరిష్కరించే వరకూ వాహనాల రాకపోకలను అడ్డుకుంటామని గ్రామస్తులు వినూతన్న నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టిడిపి నాయకుడు రోడ్డు మరమ్మతులకు హామీ ఇవ్వడంతో శుక్రవారం నిరసన కారులు నిరసనను విరమించుకున్నారు. పెళ్లకూరు మండలంలోని శిరసనం బేడు గ్రామ ప్రజలు ఈనెల 10 ,11వ తేదీల్లో ధ్వంసమైన రోడ్డును బాగు చేయాలని, గ్రామ ప్రజలు వాహనాలను అడ్డు కున్నారు. అమ్మన్ ట్రై కంపెనీ వారు, నేషనల్ హైవే కాంట్రాక్ట్ దారులు రోడ్డును బాగు చేసి ఇస్తామని హామీ ఇవ్వడంతో నిరసనలు విరమించి వాహనాలను అడ్డుకోవడం మానుకున్నారు. కానీ సమస్యను పరిష్కరించకపోడంతో తిరిగి కట్టెలు, టైర్లు మండించి గురువారం, శుక్రవారం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. అసలే మట్టి రోడ్డు, ఆపై నిత్యం భారీ వాహనాల రవాణాతో రోడ్డు ధ్వంసం అయిందని, నిత్యం లారీల రాకపోకలతో వాయు కాలుష్యంతో ఆ గ్రామస్తులు కొన్ని గంటల పాటు వాహన రాకపోకలను నిలిపివేశారు. గుంతల మయమైన రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు నిరసనకు దిగారు. ఈ సంఘటన పెళ్లకూరు మండలంలోని సరసన బేడు గ్రామంలో చోటు చేసుకుంది. శిరసనంబేడులో జాతీయ రహదారి నిర్మాణపు పనులకు సంబంధించిన భారీ లారీలు, యంత్రాలను ఆ గ్రామంలో ఏర్పాటు చేశారు. గత రెండేళ్లుగా భారీ నుంచి అతి భారీ వాహనాలు టిప్పర్లు వందల టన్నుల బరువు కలిగిన వాహనాలు ఈ రోడ్డుపైనే నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు రూపురేఖలు మారి, గుంతల మయమైంది. అమ్మన్ కర్మాగారానికి సంబంధించిన వాహనాలు సైతం ఇదే రోడ్డుపై వెళ్లడంతో ఆ గ్రామస్తులు ఆ రోడ్డుపై నడవలేని పరిస్థితిగా తయారైంది. వాహన రాకపోకలతో శబ్దాలు, దుమ్ము ధూళితో వాయుకాలుష్యంగా మారింది. దీనిపై గ్రామస్తులు ముకుమ్మడిగా నిరసన చేపట్టారు. ఇరువైపులా రోడ్డుపై వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. అమ్మన్ కర్మాగారం వారు, నేషనల్ హైవే నిర్మాణం వారు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యం కలిసి రోడ్డుని బాగా నిర్మించి ఇస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసనను విరమించుకుని వాహనాలను అడ్డుకోవడం మానుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఆచార్య కుసుమ

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రస్తుత తరుణంలో దేశ వ్యాప్తంగా రాష్ట్రంలోనూ విద్యార్థుల యువత ఎక్కువగా మత్తుకు బానిస అవుతున్నారని మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని ఎస్వీయూ సోషియాలజీ విభాగం ఆచార్యులు కుసుమ పిలుపు నిచ్చారు. ఎస్వీయూ సామాజిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షేత్ర పర్యటన ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం తిరుపతి సమీపంలోని భీమవరం గ్రామంలో విద్యార్థులకు వివిధ కార్యక్రమాలలో నిర్వహించి గ్రామంలోని ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాలకు బానిసలు అయ్యే యువత, విద్యార్థులకు అవగాహన ర్యాలీ, ఇతర సామాజిక అంశాలపై భద్రతను గురించి వివరించాలన్నారు. స్థానిక రంగంపేటలో ఆచార్య కుసుమ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. ఇటువంటి ఫీల్డ్ ప్రాజెక్టుల వలన విద్యార్థులకు సమాజంపై ప్రత్యేకమైన అవగాహన కలిగి, భవిష్యత్తులో ఉత్తమమైన బాధ్యతగల పౌరులుగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషియాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ రమణ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ముకుంద నాయుడు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

టిటిడి ఫార్మాసిస్ట్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు



సొరకాయల పాళెం జడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలని టిటిడి ఫార్మాసిస్ట్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెంకటరామా పురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో జాతీయ 63వ ఫార్మసిస్టుల వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి కావాల్సిన ప్రాణవాయువు (ఆక్సిజన్) పచ్చని మొక్కల ద్వారా ఉద్భవిస్తుందని, స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. గాలిలో కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత, పచ్చదనం పాటించాలన్నారు. ఈ సందర్భంగా సొరకాయలపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కలు నాటారు. అనంతరం పలు గ్రామాలలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎం వెంకటేశ్వర్లును కళాశాల యాజమాన్యం దుశ్శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రసన్నరాజు, ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్లు సతీష్ కుమార్, చంద్రశేఖర్, శివగామి, విద్యార్థినివిద్యార్థులు, కళాశాల సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌వియూ అంతర్ కళాశాలల పురుషుల క్రికెట్ విజేత 'సీకామ్'



క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన సీకామ్ కళాశాల జట్టు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి అంతర్ కళాశాలల క్రికెట్ పురుషుల టోర్నమెంట్‌ను వర్సిటీ వ్యాయామవిద్యా శాఖ విభాగం నిర్వహించింది. నవంబర్ 18 నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించే ఈ టోర్నీకి 30 జట్లు ఎంట్రీ ఇవ్వగా, 26 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీని ఎన్టీఆర్ స్టేడియం ఎస్వీ యూనివర్సిటీ, ఎస్వీ మెడికల్ కాలేజీ గ్రౌండ్, ఎస్వీ వెటర్నరీ గ్రౌండ్, ఎస్వీ అగ్రికల్చరల్ మైదానాల్లో నిర్వహించారు. వర్సిటీ ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఫైనల్‌లో తిరుపతిలోని సికామ్ డిగ్రీ కళాశాల విజేతగా నిలిచింది. రన్నర్‌గా కలికిరి సికామ్ డిగ్రీ కళాశాలలు నిలిచాయి. వర్సిటీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు చేతుల మీదగా విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్, ట్రోఫీని రన్నర్ జట్టుకు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదగా మెడల్స్, సర్టిఫికెట్, ట్రోఫీని అందించారు. విసి మాట్లాడుతూ వర్సిటీకి దాదాపు రూ.40 కోట్ల ఖేలో ఇండియా నిధులు సాధించేందుకు రాష్ట్ర క్రీడా, యువజన మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లు వెన్నుదన్నుగా ఉన్నాయనీ, ప్రభుత్వం క్రీడాకారుల వసతి కోసం వర్సిటీ సహాయం కోరారన్నారు. సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌ను వచ్చే విద్యా సంవత్సరంలో ఇక్కడ నిర్వహిం చేందుకు భారతీయ విశ్వవిద్యా లయాల సంఘానికి ప్రతిపాదన లు పంపుతామన్నారు. ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం తిరుపతిని క్రీడలకు కేంద్రంగా మార్చేందుకు దాదాపు భవిష్యత్తులో దాదాపు 300 కోట్ల రూపాయలు వెచ్చించనుందన్నారు. టోర్నీల లో విజేతలుగా నిలిచిన వారికి ఉచితంగా చదువులు అందించాలని కళాశాలల యాజమాన్యాలనూ రిజిస్ట్రార్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య శివశంకర్ రెడ్డి, వర్సిటీ ఈసీ మెంబర్, సీకాం కళాశాలల డైరెక్టర్ డాక్టరు సురేందర్ రెడ్డి, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టరు పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టరు పాకనాటి హరికృష్ణ, అకడమిక్ కన్సల్టెంట్లు స్వరాజ్యలక్ష్మి, గట్టు రంజిత్, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్‌కు అభినందన



అభినందనలు తెలుపుతున్న అన్నమాచార్య ప్రాజెక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శాప్ ఛైర్మన్‌గా నియమితులైన అనిమిని రవి నాయుడుని టిఎన్టి యుసి అనుబంధ సంస్థ టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకార ఉద్యోగుల యూనియన్ సభ్యులు శుక్రవారం శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కలిసి అభినందనలు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. రవి నాయుడు మాట్లాడుతూ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులకు తప్పకుండా తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి నరసింహ యాదవ్ ని కలిసి తమ సమస్యలు తెలిపి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వై హేమ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కే దేవానంద, కోశాధికారి గాలి నారాయణ నాయుడు, ఉపాధ్యక్షుడు ఉదయ భాస్కర్, సంయుక్త కార్యదర్శి హేమ కుమార్, కోఆర్డినేటర్ జగదీశ్వర్ రావు, కన్వీనర్లు జిఎం రవికృష్ణ,ఎం మాధవి, రెడ్డయ్య, మోహన్ గోపికృష్ణ పాల్గొన్నారు.

చంద్రగిరి అభివృద్ధికి సహకరించండి..

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వినతి



ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గం అభి వృద్ధికి ఇతోధికంగా సహాయం అందించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి చంద్రబాబును శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ పాకాల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చి అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. గత ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలో తిరిగిన సందర్భంగా సమస్యలను ప్రత్యక్షంగా చూశానని అంతే కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను గురించి వివరించారని చెప్పారు. ఎన్నికల ప్రచార సమయంలో సమస్యల వివరాలను తీవ్రతను నమోదు చేసుకొని ఒక నివేదిక రూపంలో అందిస్తున్నటు తెలిపారు. 2021 నవంబర్‌లో సంభవించిన తుపానుల ప్రభావంతో నియోజక వర్గంలో పలు రహదారులు, కాజ్‌వేలు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటిని అధికారుల ద్వారా పరిశీలించి అంచనాలు రూపొందించామన్నారు. గత ప్రభుత్వం రోడ్లను, ప్రజా సమస్యలను పరిష్కరించక పోవడంతో మరింత జటిలమైందని ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే నాని తీసు కెళ్లారు. గ్రామాలలో పూర్తి గా మౌలిక వసతులు లేవని వాటిని ఏర్పాటు చేయటానికి పెద్ద మొత్తంలోని నిధులు అవసరమని ముఖ్యమంత్రికి నాని చెప్పారు. ప్రజలు మనపై పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోరారు. ఈ మేరకు వివరాలతో కూడిన వినతి పత్రం అందించారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి కి తాను కట్టుబడి వున్నానన్నారు. అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే పులివర్తి నానికి హామీ ఇచ్చారు.

క్రైం న్యూస్

గోడ కూలి ఒకరి మృతి

ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): ప్రహరీ గోడ కూలి ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురు కూలీలు తీవ్ర గాయాలపాలైన సంఘటన చంద్రగిరి విజయనగర కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. చంద్రగిరికి చెందిన సుధాకర్ రెడ్డి విజయనగర కాలనీలో తన స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణానికి జెసిబితో పది అడుగుల లోతు గాడి తీయించాడు. ఆ గాడిలో ప్రహరీ గోడ నిర్మించేందుకు పునాదులు వేయడానికి గాడిలోని మట్టిని చదును చేయడానికి కూలీలు గాడిలోకి దిగారు. నూతన ప్రహరీ గోడ నిర్మాణానికి తీసిన గాడి పక్క ఇంటి ప్రహరీ గోడ పునాదుల కన్నా లోతుగా తీయడం వల్ల ఆ ప్రహరీ గోడ దెబ్బతింది. దీంతో గాడిలో మట్టి తీస్తున్న ఒరిస్సాకు చెందిన కూలీలపై గోడ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఏడు మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఏడు మంది కూలీలను చికిత్స నిమిత్తం 108లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. రుయా వైద్యులు కూలీలకు వైద్య సేవలు అందించారు. ఒరిస్సాకు చెందిన కళాఖర్ రాణా(36) చికిత్స పొందుతూ రుయాలో మృతి చెందాడు. ఈ సంఘటనపై చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనితలు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్



పోలీసుల అదుపులో అంతర్ రాష్ట్ర దొంగ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అంతర్ రాష్ట్ర దొంగను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఆరు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ డిఎస్‌పి రమణ కుమార్ తెలిపారు. స్థానిక క్రైమ్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం తిరుపతి టౌన్, ఎయిర్ బైపాస్ రోడ్‌లో తిరుపతి ఆర్డీవో ఆఫీసు ఎదురుగా ఉన్న వెస్ట్రన్ యూనియన్ మనీ ట్రాన్స్ఫర్ ఆఫీసు యజమాని సురేష్ కుమార్ శెట్టి భోజనం చేసేందుకు ఆఫీసుకు తాళం వేసి వెళ్లారు. అదే సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఆఫీసులోకి చొరబడి, క్యాష్ కౌంటర్ టేబల్ పై ఉంచిన 8 లక్షల రూపాయలు అపహరించుకుని వెళ్లాడు. యజమాని ఫిర్యాదుతో తిరుపతి జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్లు జి ప్రకాష్ కుమార్, చిన్న పెద్దయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ శుభస్ నాయక్, సిసిఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి, పాత నేరస్తుల గురించి విచారించి, వారి కదలికలపై నిఘా పెట్టారు. 22వ తేదీ 10 గంటల సమయంలో తిరుపతి పాత రేణిగుంట రోడ్డు, శ్రీ సాయి నిర్మలా కళ్యాణ మండపం వద్ద అంతర్ రాష్ట్ర దొంగ అప్పలనాయుడును అరెస్టు చేసి అతని నుండి 6 లక్షల రూపాయలు నగదు, నేరం చేయడానికి ఉపయోగించిన స్కూ డ్రైవరును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వినోద్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి -కోట : కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. అమరావతిలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విజయవాడలో ఉండటం తో కోట మండలం కోట పట్టణానికి చెందిన ప్రముఖ టిడిపి నేత, మాజీ కోట మండల పరిషత్ అధ్యక్షులు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని శుక్రవారం కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆయనకు దగ్గర బంధువు కావడంతో 'వినోద్ ఎలా ఉన్నావ్?' అని ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్ రెడ్డితో పాటు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కోట : కోట మండలంలోని బాలసదన్ వసతి గృహం విద్యార్థులకు కోట మండలం దళితవాడ కు చెందిన యువ నాయకులు మీజూరు చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో పిల్లలకు బిర్యానీ ప్యాకెట్‌లు, చాక్లెట్లు , పండ్లు పంచి పెట్టారు. అనంతరం మీజూరు చంద్ర ప్రకాష్ మాట్లాడుతూ నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా పిల్లలకు మంచి భోజనం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీజూరు చంద్రప్రకాష్, గోపి, యర్రమతి వివేక్, నీలి గోపి, డాక్టర్ మునిరాజా, ప్రకాష్, నీలేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి ఆనంద్ పనిచేసే పాఠశాలలో పేద విద్యార్థులకు చదువుకోవడానికి కావలసిన మౌలిక వసతులు సమకూర్చి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ కమిటీ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, నాగలాపురం ఎంఈఓ జనార్దన్ రాజు, శ్రీకాళహస్తి మాజీ మున్సిపల్ ఛైర్మన్ తీగల చంద్రశేఖర్, ఎల్లంపాడు ప్రధానోపాధ్యాయురాలు రేణుక, చంద్రశేఖర్ నాయుడు , కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కోడూరు బాలసుబ్రహ్మణ్యం జన్మదినం

ప్రజాశక్తి - తిరుపతి: టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు శుక్రవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురంలోని డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం నివాసానికి బిజెపి, జనసేన, టిడిపి కూటమి నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని బాణాసంచా పేల్చుతూ సంబరాలు చేశారు. గజమాలలు, శాలువాలు పుష్పగుచ్ఛాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రుయా ఆసుపత్రి వద్ద టిడిపి నాయకులు పెరుమాళ్ మధు, సతీష్ ఆధ్వర్యంలో రోగులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. హిందుస్థాని రఫీ హిందుస్థాని ఆధ్వర్యంలో మసీదులో ప్రత్యేక ప్రార్థనలు, సర్వమత ప్రార్థనలు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద సుదర్శన ఆదర్శ ఆటో స్టాండ్ అధ్యక్షుడు ఐఎస్ ఖాజా ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. టిడిపి పేరుతో ఖడ్గాన్ని తయారుచేసి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యంకు బహూకరించారు. రైతు బజార్ వద్ద టిడిపి నాయకులు ధన శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎలైట్ ఆసుపత్రిలో సిబ్బంది కేక్ కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాటకం వెంకటేష్, కరాటే చంద్ర, వంశీ రాయల్, మహబూబ్ బాషా,గుట్ట నాగరాజ రాయల్,రాజేష్, సత్యవతి, అశోక్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: TIRUPATI
HMOP NO.193 OF 2023

Y. USHA .....PETITIONER

Vs

Y. Rajendra Reddy ....RESPONDENT

HMOP SUMMONS TO RESPONDENT

Y. Rajendra Reddy,
S/o Yerrama Reddy,
Residing at Block No. 40,
Padipeta, Thiruchanoor,
Tirupati Rural, Tirupati District.

Please take notice the above case filed by the petitioner against the respondent for obtaining hindhu marriage act. you are hereby summoned to appear before the above Honble court either in person or through an Advocate duly instructed on 10-12-2024 at 10-30 A.M, Failing which the matter will be heard and decided exparte.

(N. RAMANAIAH)
ADVOCATE, TIRUPATI.

24న జీ తెలుగులో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ప్రదర్శన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించే జీ తెలుగు ఈ ఆదివారం మరో సరికొత్త సినిమాతో రాబోతోంది. విలక్షణ నటుడు రావు రమేష్ ప్రధానపాత్రలో నటించిన మారుతీనగర్ సుబ్రమణ్యం సినిమాను ఈ ఆదివారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ప్రసారం చేస్తోంది. కడుపుబ్బా నవ్విస్తూనే ఆలోచింపజేసే కామెడీ అండ్ ఎమోషనల్ ఎంటర్టైనర్గా ప్రేక్షకులను మెప్పించిన మారుతీనగర్ సుబ్రమణ్యం నవంబర్ 24న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. రావు రమేష్, ఇంద్రజ ప్రధానపాత్రల్లో నటించగా, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, అజయ్, ప్రవీణ్, హర్షవర్ధన్ కీలక పాత్రలు పోషించారు.



కేంద్రీయ లాకర్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-3లో కేంద్రీయ లాకర్ కేటాయింపు కౌంటర్ ను టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. పీఏసీ-3లో లాకర్ కేటాయింపుకు మూడు కౌంటర్ లను ఏర్పాటు చేశారు. భక్తులు గందరగోళానికి గురికాకుండా ఇకపై ఒకే చోట లాకర్లను కేటాయిస్తారు. ఇక్కడ భక్తుల కోసం 1420 లాకర్లు అందుబాటులో ఉంటాయి. గదులు దొరకని భక్తులు అసౌకర్యం కలగకుండా ఈ సదుపాయాన్ని వినియోగించు కోవచ్చు. తిరుమలలో నిర్మాణంలో ఉన్న పీఏసీ-5 భవనాన్ని ఈవో పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ భవనంలో భక్తులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రానికి చేరుకుని డోనార్ సెల్ ను పరిశీలించారు. భక్తులు విరాళం ఇచ్చేందుకు నూతనంగా ప్రారంభించిన కియోస్క్ మిషన్ తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -చంద్రగిరి: నారావారిపల్లి లో 28వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు కర్మ క్రియలకు అధిక సంఖ్యలో అభిమానులు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశానుసారం నియోజకవర్గ స్థాయి నాయకులు అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం జరుగుతున్న పనులను నారా గిరీష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధర రావు, పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ నాయుడు, నారా ప్రతాప్ నాయుడు, అబ్బూరి కోదండ రామానాయుడు, గిరి నాయుడు, ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దంతాల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దంతాల శుభ్రతపై అవగాహన కల్పించారు. శుక్రవారం ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహించారు.

కార్పొరేషన్‌లో కూటమి అ'జెండా'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి కార్పొరేషన్‌లో వైసిపి మెజార్టీ 'కూటమి'కి కంటగింపుగా ఉంది.. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌లో కూటమి జెండా ఎగురవేసేలా అజెండాను 'సెట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమరావతిలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను శుక్రవారం కార్పొరేటర్లు 17 మంది కలిసారు. వీరంతా వైసిపిపై అసంతృప్తితో ఉన్నామని, కూటమిలో చేరేందుకు సిద్ధమని వెల్లడించారు. వీరంతా ఈనెల 29 లేదంటే, డిసెంబర్ నెలలో జనసేన, టిడిపి కూటమిలో చేరే అవకాశాలున్నాయి. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో పాటు, టిడిపి కార్పొరేటర్ అన్న అనితయాదవ్, వైసిపి కార్పొరేటరులు కుడితి సుబ్రమణ్యం, పొన్నాల చంద్ర, నరసింహాచారి, నరేంద్ర, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, మాజీ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరుడు పెంచలయ్య, ఆదం తేజవతితో పాటు మరికొంతమంది ఉన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమికి 17 మంది కార్పొరేటర్ల మద్దతు ఉంది. కార్పొరేషన్‌లో కూటమి జెండా ఎగురవేయాలంటే మరో ఎనిమిది మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం ఉంది. ఈ సంఖ్య పూర్తయితే 25 మంది కార్పొరేటర్లతో మేయర్ డాక్టర్ శిరీషపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది.

మంత్రిని కలిసిన వైసిపి కార్పొరేటర్లు



2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లకు గాను 49 డివిజన్లలో ఎన్నికలు జరిగాయి. ఏడో డివిజన్ ఎన్నికలు జరగకుండా కోర్టులో కేసు నడుస్తోంది. 48 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లు గెలుపొందారు. 35వ డివిజన్‌లో మాత్రమే టిడిపి గెలుపొందింది. 26వ డివిజన్ కార్పొరేటర్ హనుమంతు నాయక్ అనారోగ్యం కారణము వల్ల మతి చెందారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ముందు వైసిపి పార్టీకి చెందిన కార్పొరేటర్ రేవతి ,44వ డివిజన్ కార్పొరేటర్ . అన్న రామచంద్రయ్య కుమార్తె కార్పొరేటర్ అయిన అన్న సంధ్య యాదవ్ జన సేన లో చేరారు . ప్రస్తుతం టిడిపి, జనసేనలో 17 మంది కార్పొరేటర్లు ఉన్నారు. మరో ఎనిమిది మంది కోసం తుడా మాజీ చైర్మన్ ఎన్ వి ప్రసాద్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గత నెల మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు 4వ తేదీ జరగాల్సి ఉండగా కూటమి ప్రభుత్వానికి కార్పొరేటర్ల సంఖ్య బలం లేకపోవడంతో వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని వైసిపి పట్టుబట్టింది. త్వరలో కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్ల సంఖ్య బలం పెంచుకొని మేయర్ డాక్టర్ శిరీష అవిశ్వాస తీర్మానం పెట్టి అన్న రామచంద్రయ్య కుమార్తెను మేయర్ చేయాలన్నది కూటమి వ్యూహమని చర్చ నడుస్తోంది.

చెత్తకుప్పలు కనిపిస్తే కఠిన చర్యలు :కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో రోడ్ల పక్కన, వీధుల్లో ఎక్కడైనా చెత్త కుప్పలు కనిపిస్తే సంబంధిత సిబ్బందిపైన, చెత్త వేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను హెచ్చరించారు. నగరంలో జరుగుతున్న పారిశుధ్ధ్య పనులు, శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది విధులపై శుక్రవారం సాయంత్రం కచ్చపి ఆడిటోరియంలో శానిటరీ అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఆయా వార్డుల్లో మెస్త్రీలు, శానిటరీ సెక్రటరీలు ఏ మేరకు పారిశుధ్ధ్య పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. నగరంలో పారిశుధ్ధ్య పనులు సక్రమంగా నిర్వహించక పోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్ధ్యం సరిగా లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఏ వార్డులో అయినా, వీధిలో అయినా రోడ్లపైన చెత్త కుప్పలు కనిపించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో పారిశుధ్ధ్య పనులు మెరుగ్గా చేపట్టేందుకు ఐదు వార్డులకు ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమిస్తున్నామని అన్నారు.ప్రతి రోజూ ఉదయం హాజరు నమోదు అయిన వెంటనే ప్రధాన వీధులను శుభ్రం చేస్తూ, చెత్త కుప్పలు తొలగించాలని అన్నారు. అటు తరువాత వీధుల్లో ఇంటింటి చెత్త సేకరణ చేయాలని అన్నారు. సేకరించిన చెత్తను నేరుగా చెత్త సేకరణ కేంద్రానికి తరలించాలని, అక్కడ నుండి తూకివాకం లోని చెత్త నిర్వహణ కేంద్రానికి తరలించాలని అన్నారు. నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్త పూర్తిగా నిర్వహణ కేంద్రానికి తరలించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయని, పునరావతం ఐతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలకు ట్రాక్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నగరంలో సి.సి. కెమెరా లు ఏర్పాటు చేయనున్నామని, ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ హాసీమ్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, శానిటరీ సెక్రటరీ లు, మేస్త్రి లు పాల్గొన్నారు.

మహిళలందరూ క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవాలి: డాక్టర్ పద్మజ

ప్రజాశక్తి - క్యాంపస్ : మహిళలందరూ గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవాలని డాక్టరు పద్మజ పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో 'మహిళల హక్కులు -ఆరోగ్యం, పరిశుభ్రత' అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో మహిళా ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థినులు వారి వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, హక్కులపై అవగాహన కల్పిస్తారన్నారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం పద్మజ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా 14 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు మహిళలందరికీ హెచ్‌పివి వ్యాక్సిన్ అందుబాటులో వుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్టల్ లో ఉండే మహిళలకు ఉండే సాధారణ ఆరోగ్య సమస్యలపై, రుతుక్రమం లోపాలు, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓఎస్) , థైరాయిడ్ రుగ్మతలు, రుతు నొప్పి వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆహారం, పోషకాహారం, శారీరక కార్యకలాపాలకు





సంబంధించిన క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. బహిష్టు రోజుల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సమయంలో మానసిక పరిస్థితులను అంచనా వేసి అధిగమించాలన్నారు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లను ఎలా వస్తాయి? వాటిని ఎలా నయం చేయాలి? తక్కువ మందులతో ఎలా పరిష్కరించాలో వివరించారు. స్త్రీ జననేంద్రియ సమస్యలపై డాక్టర్ మంజుల సలహాలు అందించారు. ముఖ్య అతిథి చర్మ వ్యాధుల నిపుణులు డాక్టరు బి మంజుల మాట్లాడుతూ మెలస్మా, గజ్జి, సాధారణ ఫంగల్ ఇన్ఫెక్షన్లు వంటివి ఎలా వస్తాయి? ఇలాంటి చర్మ రోగాలపై సమగ్ర సమాచారాన్ని విద్యార్థినులకు అందించారు. మహిళలకు అదనంగా, జుట్టు రాలడం, చుండ్రు , మొటిమలు వంటి జుట్టు, స్కాల్ప్ సమస్యలు, వాటి నివారణ, నిర్వహణ కోసం ఆచరణాత్మక చిట్కాలను ఆమె అందించారు. చర్మ సమస్యలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె సలహాలు, సమాధానాలు అందించారు. మరో అతిథి జిల్లా కోపరేటివ్ ఆఫీసర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో మహిళల హక్కులను వివరించారు. ఈ కార్యక్రమ నిర్వాహకుడు, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ గట్టు రంజిత్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

'చేయూత' టెన్త్ పరీక్ష మెటీరియల్ పంపిణీ



ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పాత చెక్పోస్ట్ ప్రాంతంలోని ఆర్.సి.యం హైస్కూల్లో శుక్రవారం సాయంత్రం చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డి ఎం ప్రత్యూష ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ను సర్పంచ్ నగేష్, ఆషా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నగేష్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిబాబు, సంస్థ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సౌరి, బిందు, కవిత పాల్గొన్నారు.

గెలుపు, ఓటమిలను సమానంగా తీసుకోవాలి

క్రీడా పోటీల ముగింపులో ఆర్ఐఓ ఎ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కోట : క్రీడాకారులు గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలని నెల్లూరు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ రీజనల్ ఇన్స్పెక్షన్ అధికారి ఏ శ్రీనివాస రావు అన్నారు. శుక్రవారం కోట మండలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల జోనల్ స్థాయి క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. ఆయా జోనల్ స్థాయి క్రీడా పోటీలు అత్యంత వైభవంగా శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ ఐ ఓ ఏ శ్రీనివాసరావు, డివిఈఓఏ మధు బాబు, నెల్లూరు డిసీఓ జయలక్ష్మి, స్థానిక మండల విద్యాశాఖాధికారి దారా మస్తానయ్య లు హాజరయ్యారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్,బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డి సి ఓ జయలక్ష్మి, డి వి ఓ ఏ మధుబాబు, ఎంఈఓ ధారా మస్తానయ్య,స్థానిక ప్రిన్సిపాల్ అద్దూరి వెంకటేశ్వర్లు, లైబ్రరియన్ విజయకుమార్, పీడీ రాజకుమార్, పి.ఈ.టి రమణయ్య,పలు ప్రిన్సిపాల్ లు,అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తదితర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ వేదికగా 2036లో 'ఒలింపిక్స్'

కేంద్ర మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే వెల్లడి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారత్ వేదికగా 2036లో ఒలంపిక్ క్రీడ సంగ్రామం జరగనుందనీ, ఆ మేరకు భారత ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని కేంద్ర డెప్యూటీ క్రీడా శాఖా మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే అన్నారు. ఖడ్సే శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆమెకు శాప్ చైర్మన్ రవి నాయుడు, ఈవో బాపిరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆమె ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్ లో దేశం గర్వించదగ్గ క్రీడాకారులు ఉన్నారన్నారు. వారిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.